క్లుప్తంగా

సవాళ్లను ఎదుర్కొనడమే జీవితం

స్వామి స్వసంవేద్యానంద మహరాజ్



కార్యక్రమంలో పాల్గొన్న స్వామి స్వసంవేద్యానంద మహరాజ్

సామర్లకోట: సవాళ్లను ఎదుర్కొనడమే జీవితమని ఉత్తరాంధ్ర రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ అధ్యక్షుడు స్వామి స్వసంవేద్యానంద మహరాజ్ అన్నారు. పీబీ దేవం శ్రీశారదా రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్సంగంలో ఆయన పాల్గొన్నారు. మాతృశ్రీ శారదాదేవిని అనుచరించాలని, ఆమె జీవిత చరిత్రను అందరూ తెలుసుకోవాలని సూచించారు. మనశ్శాంతిని కావాలంటే ఇతరుల దోషాలు ఎంచక, వారి భావాలను, బాధలను అర్థం చేసుకుని సోదరభావంతో మెలగితే ప్రపంచం వసుధైక కుటుంబంలా మారుతుందని ఆయన అన్నారు. అనంతరం సేవా సమితి ఆధ్వర్యంలో స్వామిజీని ఘనంగా సత్కరించారు. సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, కార్యదర్శి వింజమూరి విశ్వనాథం, సమితి నాయకులు నువ్వుల వెంకట్రాజు, నువ్వుల బాబ్జీ, తోటకూర వీరవెంకట సత్యనారాయణ, సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అబ్దుల్ నబీ

పెద్దాపురం: ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని సీఐ అబ్దుల్ నబీ అన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని అంబేద్కర్ భవనంలో శనివారం పట్టణ మెయిన్‌రోడ్డు, ప్రధాన కూడళ్లో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర అధ్యక్షతన ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వ్యాపారులు, సహకరించాలన్నారు. వర్తకులు, వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి మాట్లాడుతూ ట్రాఫిక్ రహిత పట్టణంగా పెద్దాపురాన్ని తీర్చిదిద్దాలన్నారు. నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులకు సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. టీపీఓ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ వి.సురేష్, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆరెళ్లి వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మందుల పంపిణీ



కట్టమూరులో ఉపాధి కూలీలకు మందులు అందజేస్తున్న ఏఎన్ఎం

పెద్దాపురం: ఉపాధి కూలీలకు శనివారం వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండలంలోని కాండ్రకోట, పులిమేరు పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాల ఉపాధి కూలీలకు ఫస్ట్ ఎయిడ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. వేసవిలో మజ్జిగ పంపిణీతో పాటు, వారికి అందుబాటులో మందులు పంపిణీ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని పంపిణీ చేస్తున్నట్లు వైద్య శాఖాధికారులు తెలిపారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలో పూజలు అందుకున్న కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని కుమారా రామభీమేశ్వరస్వామికి అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు విజయ్ ఆలయంలోని ఉప ఆలయాలలోను స్వామి వారు, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

చంద్రబాబుకు మతి భ్రమించింది



సామర్లకోటలో నిరసన ర్యాలీ నిర్వహించిన దవులూరి దొరబాబు

- ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి

సామర్లకోట: మాజీ సీఎం చంద్రబాబు నాయుడుకు మతి భ్రమించి ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పేదలకు ఇచ్చిన సెంటు స్థలం శవాలను పూడ్చడానికే సరిపోతుందన్న వ్యాఖ్యలకు నిరసనగా ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో కలిసి దొరబాబు శనివారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పార్టీ క్యాంప్ కార్యాలయం నుంచి నియోజకవర్గక పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. దొరబాబు విలేకర్లతో మాట్లాడుతూ సెంటు స్థలంలో లక్షలాది మంది ఇళ్లు నిర్మించుకుని ఎంతో సంతోషంగా ఉంటే వారి ఆత్మాభిమానాన్ని దెబ్బ తీసేలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 79వేల ఎకరాలను కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. 22 లక్షల ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోందన్నారు. ఇప్పటికే నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, మరో ఐదు లక్షల ఇళ్ల శ్లాబ్‌లు పూర్తయినట్లు వివరించారు. 50 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందని చెప్పుకునే చంద్రబాబుకు వెన్నుపోటు రాజకీయాలు తప్ప మరేమీ తెలియదన్నారు. తన రాజకీయ జీవితం కోసం ఎంతటి నీచానికైనా దిగజారుతారని ఆరోపించారు. ప్రజలు చంద్రబాబు ప్రవర్తనను గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికలే ఆయనకు చివరి ఎన్నికలన్నారు. అయ్యారక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీరరాఘవరావు, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో అధ్వానం

- కంపోస్టు యార్డుగా పిఠాపురం రోడ్డు
- చెత్తతో నిండిపోయిన రహదారి
- సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు విడుదల
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

సామర్లకోట: మున్సిపాలిటీ అభివృద్ధి వైపు పరుగులు పెడుతోంది. ఒక వైపు రైల్వే ట్రాక్, మరోవైపు గోదావరి కాలువ ఉండటంతో పిఠాపురం రోడ్డువైపు మాత్రమే పట్టణం విస్తరించడానికి అవకాశం ఉంది. దాంతో ఈ రోడ్డులో ఉప్పువారి సత్రం ఎదురుగా టిడ్కో ఇళ్ల నిర్మాణం కూడా పూర్తి అయింది. ఉప్పువారి సత్రం నుంచి మరో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోదండరామపురం వరకు మున్సిపాలిటీ పరిధి ఉంది. దాంతో అనేక మంది ఈ వైపు లే అవుట్లు వేస్తున్నారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో ఏలేరు కాలువ ఉండటంతో ప్రశాంతంగా ఉంటుందని భావిస్తున్నప్పటికీ, వారికి ముక్కు మూసుకునే పరిస్థితి ఏర్పడింది.



పిఠాపురం రోడ్డులో పేరుకుపోయిన చెత్త

కంపోస్టు యార్డులా మారిపోయింది



పిఠాపురం రోడ్డులో కొత్తగా నిర్మాణం అయిన వంతెన నుంచి ఏలేరు కాలువ రోడ్డు వెంబడి వ్యర్థ పదార్థాలను వేయడంతో ఆ ప్రాంతమంతా కంపోస్ట్ యార్డుగా దుర్వాసన వెదజల్లుతోంది. ఈ పరిస్థితి నివారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పిఠాపురం రోడ్డు వెంబడి సెప్టిక్ ట్యాంకుల వ్యర్థ పదార్థాలతో పాటు కోళ్లు, పశువుల కళేబరాలను పడవేస్తున్నారు. దాంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులకు గురి అవు తున్నారు. ఎవరూ వ్యర్థాలు వేయకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాల్స ఉంది. దీనిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తాం.

– పిట్టా సత్యనారాయణ, కౌన్సిలర్, నాలుగో వార్డు, సామర్లకోట

నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాం



పిఠాపురం రోడ్డులో బయట వ్యక్తులు వ్యర్థాలు వేస్తున్నట్టు తెలిసింది. దీనిపై నిఘా ఉంచి వారిపై చర్యలు తీసుకుంటాం. సెప్టిక్ ట్యాంకుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చాం. భవనాల డెబ్రిస్ వేసే వారిపై చర్యలు ఉంటాయి.

– సీఎంఏ నయీం అహ్మద్, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

రైతుల సమస్యలు తీర్చే ప్రభుత్వం

- డ్రైన్లలో పూడికతీతకు నిధుల మంజూరు
- శంకుస్థాపన చేసిన దవులూరి దొరబాబు
- హర్షం వ్యక్తం చేస్తున్న వీకే రాయపురం రైతులు



పూడిక తీత పనులను ప్రారంభించిన దవులూరి దొరబాబు

సామర్లకోట: రైతుల కష్టాలను గుర్తించి వాటిని పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల్లో సుమారు పదేళ్లుగా రైతుల పంట పొలాలు ముంపునకు గురవుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, తమ దృష్టికి వచ్చిన సమస్యలకు సత్వరం నిధులు మంజూరు చేయించి పరిష్కరిస్తున్నామని ఆయన అన్నారు. ఆయా గ్రామాల్లోని డ్రైన్లలో పూడిక తీతకు నిధులు మంజూరు కావడంతో దవులూరి శనివారం రైతు సంఘ అధ్యక్షుడు కుర్రా శ్రీనివాసరావు, కార్యదర్శి వెలమర్తి శ్రీనివాస్, కోశాధికారి ఇంటి రాజబాబులతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. రైతుల పంట భూములలో అదనంగా ఉన్న నీరు మరుగు కాలువలు, తూటేరు డ్రైనులోనికి వెళ్లాల్సి ఉంది. ఈ సమస్యపై సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలతో అధికారులు అంచనాలు తయారు చేసి డ్రైన్‌లో పూడిక తీతకు రూ.5 లక్షలు, కొవ్వాకాలువ, తూటేరు డ్రైన్లలో పూడిక తీతకు రూ.10.5 లక్షలు మంజూరు చేశారు. వేసవి కాలంలోనే ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో డ్రైన్స్ డీఈఈ జి.శేషగిరిరావు, ఏఈఈ బి రేష్మరాణి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పంచాయతీ ఉపసర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా సామాజిక భవనం

కొత్తపల్లి: స్థానిక గాజులదొడ్డిలో గత ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టినా సామాజిక భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. సుమారు ఎనిమిదేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాలేదు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివద్ధి నిధులు 2013–2014 సంబంధించిన రూ.4 లక్షల వ్యయంతో ఈ భవన నిర్మాణ పనులు చేపట్టారు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ భవన నిర్మాణ పనులు నేటికీ పూర్తికాలేదు. భవనం పూర్తికకుండానే శిథిలావస్థకు చేరుతుంది. గోడలు బీటలు వారుతున్నాయి. భవనానికి వేసిన ఇనుప చత్రాలు తుప్పుపడుతున్నాయి. ముఖ్యంగా గత ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టర్‌కు వత్తాసుపలకడం వలనే పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ భవనం నిర్మాణంపై అధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పూర్తికాని సామాజిక భవనం

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డు అసిస్టెంట్‌ను తొలగిస్తూ మెప్మా పీడీ అడపా వెంకటలక్ష్మి ఉత్తర్వులు ఇచ్చినట్టు ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు శనివారం తెలిపారు.

కొనేళ్లుగా జాబ్ కార్డులు లేని వారికి బినామీ పేర్లతో ఉపాధి పనులు కల్పిస్తూ దానిలో సొమ్ము స్వాహా చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులు విచారణలో నిజమని తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎంపీపీ తొలగించారు.

దళారులను ఆశ్రయించొద్దు

కొత్తపల్లి: రైతులు, కౌలు రైతులు దళారీలను ఆశ్రయించవద్దని మండల వ్యవసాయాధికారి జోగిరాజు సూచించారు. మండలంలోని వాకతిప్ప, కుతుకుడుమిల్లిలో రైతు భరోసా కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి రైతూ విత్తనం కొనుగోలు నుంచి పంటను అమ్ముకునే వరకూ అన్ని ప్రక్రియలూ గ్రామంలోనే జరగాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. రైతులు కాలానుగుణంగా పంట విత్తనాలను మార్చుకుని పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందాలన్నారు. ముఖ్యంగా రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, రసాయనిక మందులను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. నియోజకవర్గం కేంద్రంలో విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరిశీలించేందుకు ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేసిందన్నారు. రైతుల ప్రతి సమస్య ప్రభుత్వం దృష్టికి వెళతుందన్నారు.

ముగిసిన ఆర్పీల శిక్షణ

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో జిల్లా మున్సిపాలిటీలోని మెప్మా ఆర్పీలకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ శనివారంతో ముగిసింది. రెండో రోజు ఆర్పీలను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారు నేర్చుకున్న అంశాలపై చర్చించుకున్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్ ఎల్ జయరాజ్ శిక్షణ నిర్వహించారు.

జెడ్పీటీసీకి పితృవియోగం



వులవకాయల నాగసూర్యుడు

పిఠాపురం: గొల్లప్రోలు జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు తండ్రి నాగసూర్యుడు(80) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్టు బంధువులు తెలిపారు. లోవరాజు తండ్రి మృతిపై ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీత పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

100 ద్విచక్ర వాహనాల సీజ్

కాకినాడ క్రైం: నగర ట్రాఫిక్ విభాగం పరిధిలో ద్విచక్రవాహనాల తనిఖీలు ముమ్మరంగా జరిగాయి. గత మూడు రోజుల్లో వివిధ ఉల్లంఘనల కింద వంద ద్విచక్రవాహనాలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ చైతన్య కృష్ణ బృందం ఈ తనిఖీలు చేపట్టింది. ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సైలెన్సర్లు తొలగించి భారీ చప్పుళ్లతో ద్విచక్ర వాహనాలు నడపడం వంటి పలు ట్రాఫిక్ ఉల్లంఘనల్లో చోదకుల్ని పట్టుకున్నారు. పట్టుబడ్డవారంతా యువకులు, మైనర్లు కావడం గమనార్హం. దీంతో వారి తల్లిదండ్రుల్ని శనివారం పిలిపించిన పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలతో పాటు వారి తల్లుదండ్రులు సైతం బాధ్యులవుతారని వివరించి చెప్పారు. పోలీస్ శాఖ చర్యలు ఎదుర్కోవడమే కాక, కోర్టుకు హాజరుకావలసి ఉంటుందని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి ద్విచక్రవాహనాలు నడిపిన చోదకులందరిపైనా కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



తనిఖీల్లో పట్టుబడ్డ ద్విచక్రవాహనాలు

సమష్టి కృషితోనే జేఎన్‌టీయూకేకి గుర్తింపు

బాలాజీచెరువు: సమష్టి కృషితోనే జేఎన్‌టీయూకేకు ఏ ప్లస్ హోదా వచ్చిందని వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు వచ్చిన సందర్భంగా శనివారం సాయంత్రం టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ గుర్తింపుతో అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించేందుకు వీలు కలుగుతుందని, అన్ని విభాగాల్లో కన్సల్టెన్సీ సేవలు మరింత పెంచాలన్నారు. త్వరలో ఎమ్మెస్సీ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మెషీన్ లెర్నింగ్ కోర్సులు ప్రవేశపెడుతున్నామన్నారు. ఈ నెల 31న నిర్వహించే స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వీసీ ప్రసాదరాజును భారీ గజమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత పాల్గొన్నారు.



వీసీ ప్రసాదరాజును సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

పాత వస్తువుల సేకరణకు శ్రీకారం

- ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే, కమిషనర్
- 14 ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాట్లు



పాతవస్తువుల సేకరణలో పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల తదితరులు

కాకినాడ: కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ సూచన మేరకు 'మేరీలైఫ్–మేరా స్వచ్ఛ షహర్'లో భాగంగా శనివారం నుంచి పాత వస్తువుల సేకరణ ప్రక్రియకు నగరపాలక సంస్థ శ్రీకారం చుట్టింది. రెడ్యూస్–రీసైకిల్–రీయూజ్ విధానంలో ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న బట్టలు, పుస్తకాలు, బొమ్మలు, పాదరక్షలు వంటి రీసైక్లింగ్‌కు ఉపయోగపడే వస్తువులను 20 రోజుల పాటు సేకరించాలన్నది ఈ కార్యక్రమ లక్ష్యం. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని స్థానిక వివేకానందపార్కు ఆవరణలో శనివారం ప్రారంభించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వద్ద నిరుపయోగ వస్తువులను ఇక్కడ అందజేశారు. రెండు కేజీలకు మించి బరువు ఉన్న వస్తువులు అందజేసిన వారికి కమిషనర్ పేరిట సర్టిఫికెట్లను అందజేశారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరంలో ఎంపిక చేసిన 14 ప్రాంతాల్లో ఈ వస్తువులను స్వీకరించనున్నారు. వచ్చే నెల ఐదో తేదీ వరకు పాత వస్తువుల సేకరణ కొనసాగనుంది.

ప్రజలు స్పందించాలి : ఎంపీ

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను రీసైక్లింగ్ కోసం ప్రతి ఒక్కరూ అందజేయాలని ఎంపీ గీత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో వస్తుసేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసినందున ప్రజలంతా సమీపంలోని కేంద్రం వద్ద పాత వస్తువులను అందజేయాలని సూచించారు. ఇరుగుపొరుగు వారిని కూడా చైతన్య పరిచి ఇలాంటి మంచి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని అన్నారు. కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న 45 రకాల వ్యర్థాలను నిర్దేశించిన కేంద్రాల్లో అందజేయవచ్చునన్నారు. సుమారు 5 నుంచి 10 టన్నుల పాత వస్తువులు సేకరించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని తదితరులు స్వయంగా తమ ఇళ్లలోని పాత వస్తువులను అందజేశారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డీఈ మాధవి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు టిప్పర్లు ఢీ

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

సామర్లకోట: స్థానిక అచ్చంపేట ఏడీబీ రోడ్డులో శనివారం సాయంత్రం ఎదురు ఎదురుగా వచ్చిన రెండు టిప్పర్లు ఢీకొనడంతో ఆ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం అచ్చంపేట జంక్షన్ నుంచి సామర్లకోట వైపు వస్తున్న టిప్పర్, సామర్లకోట నుంచి అచ్చంపేట వెళ్తున్న టిప్పరు ఏడీబీ రోడ్డులో ఉండూరు జంక్షన్ వద్ద ఢీ కొన్నాయి. దాంతో రెండు టిప్పర్లలోని డ్రైవర్లు స్వలంగా గాయపడ్డారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆధ్వర్యంలో తన సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అచ్చంపేట ఏడీబీ రోడ్డు ఉండూరు జంక్షన్ వద్ద ఢీకొన్న టిప్పర్లు

వ్యక్తి అదృశ్యంపై కేసు

కాకినాడ రూరల్: కాకినాడ నగరం విద్యుత్ నగర్ నాన్సీ వీధికి చెందిన చలికి వీరేంద్ర అదృశ్యంపై సర్పవరం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు సీఐ ఆకుల మురళీకృష్ణ శనివారం తెలియజేశారు. ఈనెల 15న ఇన్నోవా (ఏపీ39వి 5403) కారులో విజయవాడ వెళ్ళిన వీరేంద్ర 18న మధ్యాహ్నం 2.30 గంటల నుంచి కనిపించడం లేదన్నారు. చివరిగా కొవ్వూరు టోల్‌గేట్ వద్ద క్రాస్ చేసినట్టు నమోదైందని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆచూకీ లభిస్తే సీఐ సెల్ నంబర్ 94407 96554, డీఎస్పీ నంబర్ 94407 96505కు సమాచారం ఇవ్వాలని కోరారు.



చలికి వీరేంద్ర

కలెక్టర్ ఆమోదానికి విలువ ఆధారిత సవరణలు

కాకినాడ సిటీ: స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ విలువ ఆధారిత సవరణల కమిటీ సమావేశం శనివారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో బీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి సంవత్సరం భూమి విలువ మార్కెట్ ఆధారిత సవరణల ప్రక్రియకు సంబంధించి వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువకు నిర్ధారణ కమిటీ సమావేశం నిర్వహించామన్నారు. ఈ కమిటీ సవరణలను కలెక్టర్ ఆమోదానికి పంపించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాకినాడ రెవెన్యూ డివిజన్‌లోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

జగ్గంపేట: స్థానిక గోకవరం రోడ్డులో సీఐ సూర్యఅప్పారావు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 31 కేసులకు సంబంధించి రూ.5,425 వసూలు చేసినట్టు ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న వాహనదారులకు విధించిన చలానలు కట్టడంలేదని, వారి నుంచి వసూలు చేశామన్నారు. వాహనయజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనితో పాటు సరైన పత్రాలు లేని నలుగురి వద్ద నుంచి రూ.2వేలు జరిమానా వసూలు చేసినట్టు చెప్పారు.

కోడి పందేలపై దాడి

తొండంగి: అద్దరిపేట శివారులో శనివారం కోడిపందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడిచేశారు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అద్దరిపేట శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.460 నగదు, రెండు కోడి కత్తులు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

స్మార్ట్ పనులు 4 నెలల్లో పూర్తి

- ప్రజోపయోగ పనులకే నిధులు
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- ఎంపీ గీతతో కలసి స్కేటింగ్ రింక్ పనుల పరిశీలన

కాకినాడ: నగరపాలక సంస్థ నూతన భవనం మినహా స్మార్ట్ సిటీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ నాలుగు నెలల్లో పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక రాజాట్యాంక్ పార్కులోని స్కేటింగ్ రింక్‌ను ఎంపీ వంగా గీత, కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, అధికారులతో కలసి సందర్శించారు. స్కేటింగ్ రింక్ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులు నత్తనడకనసాగుతున్నాయంటూ ఇటీవల టీడీపీ నేతలు చేసిన విమర్శలపై మండిపడ్డారు. ఒకరితో వేలెత్తి చూపించుకునేలా తమ పరిపాలన ఉండదని, ఒక క్రమ పద్ధతిలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. గత టీడీపీ హయాంలో కమీషన్ల కోసం కక్కుర్తిపడి అవసరం లేని అభివృద్ధి పనులకు స్మార్ట్ సిటీ నిధులు కేటాయించారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీ గీత సమన్వయంతో తాను ప్రత్యేక దృష్టి సారించి స్మార్ట్ సిటీ నిధులను ప్రజోపయోగ పనుల కోసం వెచ్చించామన్నారు. ప్రతిపాదిత పనులన్నింటినీ నాలుగు నెలల్లో పూర్తి చేసి చూపిస్తామని, అవసరమైతే టీడీపీ నేతలను కూడా తీసుకువెళ్లి చేసిన పనుల ప్రగతిని చూపించేందుకు సైతం సిద్ధమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్కేటింగ్ రింక్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అతిత్వరలోనే వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎమ్మెల్సీ అభ్యర్థిని కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకట్రావు, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, రోకళ్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిపాముల గణపతి తదితరులు పాల్గొన్నారు.